'జగనన్న సురక్ష 'కు శ్రీకారం


పట్టణంలోని 2వ సచివాలయ పరిధిలో సర్వే పర్యవేక్షిస్తున్న కమిషనర్ కొలిమి షమ్మి


గుడిపూడిలో క్షేత్రస్థాయి సర్వేలో ఎంపీడీవో సత్యనారాయణ తదితరులు

- ప్రభుత్వ సేవలు సులభతరం
- పురపాలక సంఘ పరిధిలో రెండు బృందాలు
- పట్టణంలో క్షేత్రస్థాయిలో ప్రారంభమైన సర్వే

సత్తెనపల్లి: ప్రజలందరికీ ప్రభుత్వ సేవలు మరింత సులభతరంగా అందించాలనే ప్రధాన లక్ష్యంతో ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం 'జగనన్న సురక్ష' కార్యక్రమానికి శనివారం శ్రీకారం చుట్టింది. సత్తెనపల్లి పురపాలక సంఘం ఏర్పాట్లు పూర్తి చేసింది. ఈ కార్యక్రమం ద్వారా ప్రజలకు 11 రకాల సేవల్ని తక్షణమే అందించేందుకు ప్రభుత్వం నిర్ణయించగా..ఆ మేరకు అర్హుల జాబితాను సిద్ధం చేసేందుకు అధికారులు కార్యాచరణ రూపొందించారు. పట్టణంలో 31 వార్డులు ఉండగా..వాటి పరిధిలో జనాభా ప్రతిపాదికన 15 సచివాలయాలు ఉన్నాయి. వాటన్నింటి పరిధిలో వచ్చే నెల ఒకటి నుంచి కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. ఆయా సచివాలయాల్లో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించేందుకు వారం రోజుల ముందు వలంటీర్లు , గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు ఆయా సచివాలయాల పరిధిలో ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరించనున్నారు. దీనిలో భాగంగా శనివారం పట్టణంలోని 2వ సచివాలయ పరిధిలో సర్వే చేపట్టారు. సేకరించిన వివరాల ఆధారంగా నిర్దేశించిన తేదీల్లో ఆ సచివాలయం పరిధిలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ప్రత్యేక శిబిరం నిర్వహించి వారికి అవసరమైన ధ్రువపత్రాలు అందజేయనున్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మి, మున్సిపల్ మేనేజర్ ఎస్.సాంబశివరావు నేతృత్వంలో ఎనిమిది మందితో కూడిన ప్రత్యేక బృందాల్ని నియమించారు. ఒక్కో బృందంలో నలుగురు సభ్యులు ఆయా తేదీల్లో నిర్వహించే కార్యక్రమాల్ని దగ్గరుండి పర్యవేక్షించనున్నారు.

సర్వే ఇలా...

జగనన్న సురక్ష కార్యక్రమాన్ని వచ్చే నెల ఒకటి నుంచి ప్రారంభించనుండగా .. కార్యక్రమం నిర్వహించే సచివాలయం పరిధిలోని ప్రతి కుటుంబాన్నీ వారం రోజుల ముందుగా సంబంధిత వలంటీర్, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు కలవనున్నారు. వారికి అవసరమైన ధ్రువపత్రాల కోసం వివరాల్ని సేకరించనున్నారు. సంక్షేమ పథకాలు అర్హులకు అందకపోతే అందుకు గల కారణాల్ని నమోదు చేయనున్నారు. ఇలా పట్టణంలోని ప్రతి కుటుంబాన్నీ కలసి జగనన్న సురక్ష కార్యక్రమంలో వారికి అవసరమైన ధ్రువపత్రాలు అందజేయనున్నారు. రాష్ట్ర స్థాయిలో, జిల్లా స్థాయిలో పరిష్కరించాల్సిన సమస్యల్ని ఉన్నతాధికారులకు నివేదించి పరిష్కారం చూపనున్నారు.

సత్తెనపల్లి రూరల్‌లో షెడ్యూల్ ఇలా....

తేదీ	టీమ్‌-1 సచివాలయం	టీమ్‌-2 సచివాలయం
01-04-2023	పెద్దమక్కెన	గుడిపూడి
04-07-2023	నందిగామ-1	నందిగామ-2
06-07-2023	కొమెరపూడి	కంటెపూడి
11-07-2023	లక్కరాజుగార్లపాడు	భీమవరం
13-07-2023	అబ్బూరు	భట్లూరు
18-07-2023	ఫణిదం-1	ఫణిదం-2
20-07-2023	కట్టమూరు	రెంటపాళ్ళ
25-07-2023	పాకాలపాడు	కంకణాలపల్లి
27-07-2023	బృగుబండ	కందులవారిపాలెం
29-07-2023	ధూళిపాళ్ల	-

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందాలి: ఆర్డీవో


ఇరుకుపాలెంలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న సత్తెనపల్లి ఆర్డీవో రాజకుమారి

ఇరుకుపాలెం(ముప్పాళ్ల): అర్హులందరికీ ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందాలని సత్తెనపల్లి ఆర్డీవో బి.ఎల్.ఎన్. రాజకుమారి చెప్పారు. మండలంలోని ఇరుకుపాలెంలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని శనివారం ఆమె పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజల గడప వద్దకే ప్రభుత్వ సేవలందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ చేపట్టిందన్నారు. ప్రతి వలంటీరు ఇంటికి వెళ్లి వారి సమస్యల్ని తెలుసుకొని, నమోదు చేసుకోవాలని తెలిపారు. నెల రోజుల పాటు ఈ కార్యక్రమం జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎం.భవానీశంకర్, డిప్యూటీ తహసీల్దార్ సీహెచ్. లక్ష్మీప్రసాదు, ఆర్ఐలు పవన్‌కుమార్, కపిల్‌దేవ్ పాల్గొన్నారు.

సత్తెనపల్లి పట్టణంలోని సచివాలయాల పరిధిలో షెడ్యూలు ఇలా..

తేదీ	వార్డు సచివాలయం పేర	తేదీ	వార్డు సచివాలయం పేర
1-07-2023	టీటీడీ కల్యాణ మండపం	12-07-2023	వ్యవసాయ మార్కెట్ యార్డు
4-07-2023	అచ్చంపేట రోడ్డు	13-07-2023	ఎన్జీవో హోం సెంటర్
5-07-2023	రంగా కాలనీ	15-07-2023	భవిరిశెట్టి వారి స్ట్రీట్
6-07-2023	కంభాల బావి	17-07-2023	వెంగళరెడ్డి నగర్
7-07-2023	వడ్డవల్లి ఏరియా	18-07-2023	ఓల్డ్ సాలిపేట
10-07-2023	వడ్డవల్లి	19-07-2023	వెంకటపతి నగర్
11-07-2023	క్రిస్టియన్ పేట	20-07-2023	కొత్తపేట
		21-07-2023	శాలివాహన నగర్

'జగనన్న సురక్ష'తో సమస్యలకు పరిష్కారం


మాదిపాడులో గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎంపీడీవో శివసుబ్రహ్మణ్యం

అచ్చంపేట: జగనన్న సురక్షతో సమస్యలకు పరిష్కారం లభిస్తుందని ఎంపీడీవో పి.శివసుబ్రహ్మణ్యం తెలిపారు. మండలంలోని మాదిపాడులో శనివారం ఎంపీడీవో టీం, కొండూరులో తహసీల్దారు పద్మాదేవి టీం పర్యటించి గ్రామస్తులకు ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు. పథకాలు అందుతున్నాయో లేదో తెలుసుకునేందుకు ఇంటింటికీ సర్వే నిర్వహించారు. వలంటీర్ల సాయంతో పథకాల లబ్ధి చేకూరని వారి పేర్లు తెలుసుకున్నారు.

పెదకూరపాడులో..

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని శనివారం మండలంలోని 75త్యాళ్ళూరు, జలాల్‌పురం సచివాలయాల పరిధిలో ప్రారంభించారు.అధికారులు, గృహసారథు లు, సచివాలయాల కన్వీనర్లు, వలంటీర్లు ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలు అందుతున్న తీరు.. పథకాలు పొందేందుకు కలిగిన సాంకేతిక సమస్యలను అడిగి సర్వే నిర్వహించారు. అర్హత ఉండి వివి ధ కారణాలతో ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందని వారిని గుర్తించి వారి వివరాల్ని యాప్‌లో నమోదు చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ క్షమారాణి, ఎంపీడీవో నరసింహారావు, మండల సచివాలయాల కన్వీనర్ మాగులూరి అనిల్‌కుమార్, పలు శాఖల అధికారులు, ఆయా గ్రామాల వలంటీర్లు, సచివాలయాల కన్వీనర్లు, గృహ సారథులు పాల్గొన్నారు.

నకరికల్లులో..

అర్హులైన ప్రతి ఒక్కరికీ పార్టీలకు, కులమతాలకు అతీతంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించాలన్న ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ఆకాంక్షకు అనుగుణంగా అందరూ పనిచేయాలని ఎంపీడీవో బండి శ్రీనివాసరెడ్డి ఆదేశించారు. జగనన్న సురక్ష కార్యక్రమంపై మండలంలోని చీమలమర్రి, చల్లగుండ్ల గ్రామాల్లో వలంటీర్లకు, సచివాలయ సిబ్బందికి శనివారం అవగాహనాసదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాల అర్హుల్ని గుర్తించాలని తెలిపారు. అనంతరం రెండు గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి పథకాల లబ్ధి గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ అరవా ఆదిలక్ష్మి, ఈవోపీఆర్డీ గిరిధర్, కార్యదర్శులు అప్పారావు, శైలేంద్రకుమార్, ఎంపీటీసీ సభ్యులు కోటిరెడ్డి, అంజిరెడ్డి, వంగా రాజారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

పెదకూరపాడులో..

మండలంలోని బలుసుపాడు, కాశీపాడు, కంభంపాడు గ్రామాల్లో జగనన్న సురక్షపై వలంటీర్లు, గ్రామ సచివాలయాల కన్వీనర్లు, గృహ సారథులకు శిక్షణ ఇచ్చారు. సర్వే, యాప్‌లో నమోదుపై మండల సచివాలయాల కన్వీనర్ మాగులూరి అనిల్‌కుమార్, శిక్షకులు శ్రీనివాసరావు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు బచ్చు హనుమంతరావు, నాగేశ్వరరావు, సుధాకర్, ఉమామహేశ్వరరావు, మస్తాన్ పాల్గొన్నారు.

ముప్పాళ్లలో..

మండలంలోని దమ్మాలపాడు, ఇరుకుపాలెం గ్రామాల్లో జగనన్న సురక్ష సర్వేను సత్తెనపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కళ్లం శివరామిరెడ్డి, మండల సచివాలయాల జేసీఎస్ కన్వీనర్ రెండెద్దుల వెంకటేశ్వరరెడ్డి శనివారం ప్రారంభించారు. వలంటీర్లతో కలసి ఇంటింటికీ వెళ్లారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయా లేదా తెలుసుకొని, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు కోటిరెడ్డి, పీలా లక్ష్మణ్, శ్రీనివాసరెడ్డి, రామకృష్ణ, సచివాలయ కన్వీనర్ శ్రీకాంత్‌రెడ్డి, సుధాకర్ పాల్గొన్నారు.

క్రోసూరులో..

మండలంలోని అందుకూరు, ఊటుకూరు గ్రామాల్లో శనివారం మండల అధికారులు, వలంటీర్లు, గృహ సారథులు, వైఎస్సార్ సీపీ నాయకులు ఇంటింటికీ వెళ్లి జగనన్న సురక్ష సర్వే నిర్వహించారు. ఊటుకూరులో నోడల్ అధికారిగా ఎంపీడీవో ఎం.మహేష్, అందుకూరులో పంచాయతీ విస్తరణాధికారి పి.శివరామయ్య, పంచాయతీ కార్యదర్శులు, వలంటీర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు జంగా నవీన్, వెలది అప్పారావు, అబ్దుల్ రహీం, తిప్పిరెడ్డి అప్పిరెడ్డి, దుగ్గి ఏడుకొండలు, జన్నవరపు శ్రీనివాసరెడ్డి, మర్రి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

క్లుప్తంగా

క్రోసూరు పీహెచ్‌సీ వైద్యురాలిగా రమాదేవి



క్రోసూరు: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలిగా డి.ఎస్. రమాదేవి శనివారం బాధ్యతలు చేపట్టారు. ఆమె తెనాలి ఫ్యామిలీ ప్లానింగ్ యూనిట్ నుంచి ఇక్కడకు బదిలీపై వచ్చారు. సోమవారం నుంచి విధులకు హాజరవుతానని తెలిపారు. గతంలో ఇక్కడ పనిచేసిన డాక్టర్ ప్రవీణ దీప్తి పెదకాకానికి బదిలీ అయ్యారు. ప్రస్తుతం క్రోసూరు పీహెచ్‌సీకి ఇద్దరు వైద్యులున్నారు.

ఆశ్రమ విద్యార్థులకు దుస్తుల పంపిణీ

రాజుపాలెం: కొండమోడు సమీపంలోని వీరమ్మ కాలనీలో గల అనాథ పిల్లలు, వృద్ధుల ఆశ్రమాన్ని డెప్యూటీ డీఈవో వి.వెంకటేశ్వరరావు శనివారం పరిశీలించారు. విద్యార్థుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం రూ. 4వేలు విలువైన దుస్తులు, పుస్తకాలను పంపిణీ చేశారు. పిల్లలకు లోటు లేకుండా చూసుకోవాలని ఆశ్రమ నిర్వాహకులు గరికపాటి శంకరరావుకు సూచించారు. కార్యక్రమంలో కాకుమాను చంద్రమౌళి, కాకుమాను రామకృష్ణ, ఆశ్రమ సూపర్‌వైజర్ గరికపాటి విజయలక్ష్మి, ఎస్‌కే వలి పాల్గొన్నారు.

ఎనికేపాడులో రోడ్లకు శంకుస్థాపన



అమరావతి: మండల పరిధిలోని ఎనికేపాడులో రూ. 20లక్షలతో పలు గ్రావెల్, సిమెంటు రోడ్లకు శనివారం నర్సరావుపేట పార్లమెంటు సభ్యుడు లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే నంబూరు శంకరరావు శంకుస్థాపన చేసి, శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వర్షాల వల్ల గ్రామస్తులకు ఇబ్బంది కలుగకుండా త్వరితగతిన పనులు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ మందపాటి శేషగిరిరావు, ఎంపీపీ మేకల హనుమంతరావు, క్రోసూరు మార్కెట్ యార్డు చైర్మన్ ఈదా సాంబిరెడ్డి, మండల సచివాలయ కన్వీనర్ భవిరిశెట్టి హనుమంతరావు పాల్గొన్నారు.

ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాంలో వైద్య పరీక్షలు

సత్తెనపల్లి: ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాంలో భాగంగా సత్తెనపల్లి మండలం గండ్లూరులో ఫణిదం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి డాక్టర్ యు.శ్రీలక్ష్మీ కవిత శనివారం వైద్య పరీక్షలు నిర్వహించారు. మొత్తం 77 మందికి వైద్య పరీక్షలు చేయగా, వీరిలో జనరల్ ఓపీ 52 మంది, హైపర్ టెన్షన్ 10 మంది, డయాబెటిస్ 15 మంది ఉన్నారు. అనంతరం దీర్ఘకాల వ్యాధులతో బాధపడుతూ నడవలేని వారి ఇళ్లకే వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి చిన్నారులకు ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ సుశీల, ఏఎన్‌ఎం విజయ్‌కుమారి, హెల్త్ అసిస్టెంట్ పెండెం నటరాజ్, డీఈవో సుధాకర్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

840 గ్రాముల గంజాయి స్వాధీనం

ఇద్దరి అరెస్టు

నకరికల్లు: ఇద్దరి నుంచి 840 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకుని, అరెస్టు చేసినట్లు ఎస్ఐ పి.సురేష్ శనివారం తెలిపారు. మండలంలోని చల్లగుండ్ల పొలిమేర సమీపంలోని గేదెల ఫారం వద్ద గంజాయితో వ్యక్తి సంచరిస్తున్నాడన్న సమాచారం మేరకు సిబ్బందితో నిఘా పెట్టామన్నారు. గేదెల ఫారంలో పనిచేస్తున్న బిహార్‌కు చెందిన భరూన్ రామ్‌కు, పిడుగురాళ్లలోని లెనిన్‌నగర్‌కు చెందిన తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు గంజాయి ఇస్తుండగా శనివారం అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు.ఇద్దరిని అరెస్టు చేసి వారి దగ్గరున్న 840గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకొని, కోర్టుకు హాజరుపర్చినట్లు తెలిపారు.

హోండా షైన్‌-100 సీసీ ద్విచక్ర వాహనం ప్రారంభం



సత్తెనపల్లి: హోండా కంపెనీ సరికొత్త ఫీచర్స్‌తో మార్కెట్లోకి ఇటీవల విడుదల చేసిన షైన్-100 సీసీ ద్విచక్ర వాహనాన్ని మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మి ప్రారంభించారు. పట్టణంలోని చెక్‌పోస్ట్ సమీపంలో గల హోండా షోరూంలో వాహన తాళాన్ని శనివారం ఆయన కొనుగోలుదారుడికి అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజల అభిరుచులకు అనుగుణంగా హోండా కంపెనీ నూతన టెక్నాలజీలతో వాహనాల్ని అందించడంలో ముందంజలో ఉందని తెలిపారు. కార్యక్రమంలో జీఎం నిరంజన్, సేల్స్ మేనేజర్ సంతోష్, డీలర్ బాషా, రెహమాన్, సిబ్బంది పాల్గొన్నారు.

యువత నైపుణ్యాల్ని మెరుగుపరచుకోవాలి

- మంత్రి అంబటి రాంబాబు
- మెగా జాబ్ మేళాకు 415 మంది హాజరు


మెగా జాబ్ మేళాలో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మంత్రి అంబటి రాంబాబు

సత్తెనపల్లి: యువత నైపుణ్యాల్ని మెరుగుపరచుకుని, నిర్దేశిత లక్ష్యాలకు చేరుకోవాలని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు సూచించారు. పట్టణంలోని ప్రగతి డిగ్రీ కళాశాల ఆవరణలో ఉపాధి కల్పన, నైపుణ్య శిక్షణ సంస్థ సౌజన్యంతో శనివారం మెగా జాబ్ మేళాను ఆయన ప్రారంభించి మాట్లాడారు. యువతలో నైపుణ్యాలకు పదును పెట్టడమే లక్ష్యంగా స్కిల్ హబ్‌లు పనిచేస్తున్నాయని తెలిపారు. ఇక్కడ శిక్షణ పొందిన వారికి వివిధ బహుళజాతి సంస్థలు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నాయని చెప్పారు. జాబ్‌మేళా ద్వారా చిన్న ఉద్యోగంలోనైనా చేరి ఉపాధి పొందుతూ మెరుగైన అవకాశాల కోసం కృషి చేయాలని మంత్రి సూచించారు.పల్నాడు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి కె.సంజీవరావు మాట్లాడుతూ జాబ్‌మేళాకు 415 మంది హాజరు కాగా, తొలి విడతలో 106 మంది, మలి విడతకు 93 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు చెప్పారు. జాబ్‌మేళాలో వల్లభ మిల్క్ డైరీ ప్రొడక్ట్స్ , గ్రీన్ టెక్ ఇండస్ట్రీస్, ఫిన్ కేర్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ , ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్, మాస్టర్ మైండ్స్, హెటిరో డ్రగ్స్, మహేంద్ర అండ్ మహేంద్ర, అపోలో, ఫిలిప్ కార్ట్ ఇలా .. మొత్తం 17 కంపెనీల అధికారులు పాల్గొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి నిమ్మకాయల రాజనారాయణ, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చల్లంచర్ల సాంబశివరావు, డీఆర్‌డీఏ పీడీ బి.బాలునాయక్, స్పెషల్ ఆఫీసర్ సుధాకర్, మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మి, ప్రగతి విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ మక్కెన అచ్చయ్య , ఎంపీడీవో జి.వి.సత్యనారాయణ, తహసీల్దార్ ఎస్. సురేష్ , ప్రగతి డిగ్రీ కళాశాల డైరెక్టర్ గంగారపు అనూష, నైపుణ్యాభివృద్ధి సంస్థ ఏడీఎస్ఈ వి.సీహెచ్. రామాంజనేయులు, పల్నాడు జిల్లా ప్లేస్‌మెంట్ ఎగ్జిక్యూటివ్ యం.రవీంద్రనాయక్, కో-ఆర్డినేటర్స్ యం.వీరాంజనేయులు, రామకృష్ణారెడ్డి, జానీ బాషా, శ్రీకాంత్, మణికంఠ గోపాల్ పాల్గొన్నారు.

సీసీఆర్సీ కార్డులతో బహుళ ప్రయోజనాలు


ముప్పాళ్లలో ప్రచారాన్ని ప్రారంభిస్తున్న డెప్యూటీ తహసీల్దార్ లక్ష్మీప్రసాదు, అధికారులు

ముప్పాళ్ల : సీసీఆర్సీ (క్రాప్ కల్టివేటర్ రైట్స్) కార్డులతో కౌలు రైతులకు అనేక ప్రయోజనాలు ఉన్నాయని, ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా తీసుకోవాలని డెప్యూటీ తహసీల్దార్ సీహెచ్. లక్ష్మీప్రసాదు చెప్పారు. మండలంలోని ముప్పాళ్లలో దళిత బహుజన రీసోర్సు సెంటర్ ఆధ్వర్యంలో కౌలు రైతుల ప్రచార ఉద్యమం కరపత్రాల్ని శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా లక్ష్మీప్రసాదు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, కౌలు రైతులు సీసీఆర్సీ కార్డు పొందడం వల్ల రైతుభరోసా కేంద్రం నుంచి ఇన్‌పుట్ సబ్సిడీ విత్తనాలు, ఎరువులు, బ్యాంక్ రుణాలు పొందవచ్చని తెలిపారు. డీబీఆర్సీ ఏరియా కో-ఆర్డినేటర్ మేడే వెంకటరమణ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ కాలనీల్లోని కౌలు రైతులకు సీసీఆర్సీ కార్డులపైన అవగాహన పెంపొందేలా గ్రామ సమావేశాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీవో పి.పుట్టారెడ్డి, ఏవో అరుణ, ఏపీవో రామారావు, వీఆర్వోలు హరిప్రసాద్, సంజీవరావు, మస్తాన్, మాబువలి, ఏఈవో శైలజ, డీబీఆర్సీ ప్రతినిధి మన్నం కోటేశ్వరరావు, నరేంద్ర పాల్గొన్నారు.

ప్రతి కుటుంబం దరికి 'సంక్షేమ'ం

ఎమ్మెల్యే నంబూరు శంకరరావు


నెమలికల్లులో వృద్ధురాలి సమస్యల్ని వింటున్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

అమరావతి: ప్రతి కుటుంబానికి సీఎం వై.ఎస్. జగన్మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన నవరత్నాల ద్వారా సంక్షేమ సాయం అందిస్తున్నామని పెదకూరపాడు శాసనసభ్యుడు నంబూరు శంకరరావు తెలిపారు. మండలంలోని నెమలికల్లులో శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయనకు వైఎస్సార్ సీపీ నాయకుడు ఆళ్ల శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గ్రామంలోని 350 ఇళ్లకు వెళ్లి సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. ఏవైనా సమస్యలుంటే తన దృష్టికి తేవాలని సూచించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఆయన దృష్టికి తెచ్చిన చిన్నచిన్న సమస్యల్ని వెంటనే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మూడున్నరేళ్లలో పెదకూరపాడు నియోజకవర్గంలో ఎంతో అభివృద్ధి చేశామని తెలిపారు. నెమలికల్లులో రూ.9 కోట్లతో సంక్షేమ పథకాలు, రూ.3 కోట్ల విలువైన అభివృద్ధి పనులు చేపట్టామని పేర్కొన్నారు.

షాదీ తోఫా అందజేత

ఇటీవల వివాహం జరిగిన షేక్ రసూల్ కుమార్తె జాన్‌బీకి షాదీ తోఫా కింద మంజూరైన రూ.లక్ష చెక్కును ఎమ్మెల్యే నంబూరు శంకరరావు అందజేశారు. కార్యక్రమంలో జీడీసీసీ బ్యాంకు డైరెక్టర్ కోట హరిబాబు, గ్రామ సర్పంచ్ కోవూరి రాంబాబు, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు మంగిశెట్టి శ్రీనివాసరావు, ఆళ్ల శివలక్ష్మీ కుమారి, క్రోసూరు మార్కెట్ యార్డు చైర్మన్ ఈదా సాంబిరెడ్డి, ఎండ్రాయి, మునగోడు సర్పంచులు నాయుడు రాంబాబు, బంకా విష్ణు, మండల సచివాలయ కన్వీనర్ భవిరిశెట్టి హనుమంతరావు, వైఎస్సార్ సీపీ నాయకులు నంబూరు బాబూరావు, మంగిశెట్టి కోటేశ్వరరావు, ఆళ్ల శ్రీనివాసరెడ్డి, బోళ్ల మాధవరెడ్డి, నిమ్మా విజయసాగర్‌బాబు, చిలకా సాంబయ్య, మాదాసు రాంబాబు, వీరరాఘవయ్య, యలమందయ్య పాల్గొన్నారు.

కుష్ఠు వ్యాధిపై అవగాహన అవసరం

పెదకూరపాడు: కుష్ఠు వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని 75 త్యాళ్లూరు పీహెచ్‌సీ వైద్యాధికారి వెలుగొండరెడ్డి సూచించారు. వ్యాధి నివారణపై ఆశ కార్యకర్తలు, ఆరోగ్య కార్యకర్తలకు శనివారం ఆయన పీహెచ్‌సీలో అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇంటింటికీ ఆశ, ఆరోగ్య కార్యకర్తలు వెళ్లి వ్యాధిగ్రస్తుల్ని గుర్తించాలని తెలిపారు. డెప్యూటీ పారామెడికల్ అధికారి మహేశ్వరరావు మాట్లాడుతూ ఈ నెల 26 నుంచి జులై 16 వరకు ఇంటింటి సర్వే నిర్వహించాలని ఆదేశించారు. చర్మంపై రాగిరంగు మచ్చలు ఉండి, స్పర్శ లేకపోతే వారిని ఆరోగ్య కేంద్రానికి పంపించాలని తెలిపారు. అనంతరం సబ్ యూనిట్ అధికారి బేగం ఆధ్వర్యంలో మలేరియా మాసోత్సవ ర్యాలీ నిర్వహించారు.

బెల్లంకొండ తహసీల్దార్‌గా దుర్గేష్



బెల్లంకొండ: తహసీల్దార్‌గా ఎస్.దుర్గేష్ శనివారం బాధ్యతలు చేపట్టారు. కలెక్టర్ కార్యాలయంలో పనిచేస్తున్న ఆయన బదిలీల్లో భాగంగా బెల్లంకొండకు వచ్చారు. ఇప్పటివరకూ ఇన్‌చార్జ్‌గా పనిచేసిన బి.నిర్మలను డెప్యూటీ తహసీల్దార్‌గా నియమిస్తూ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ దుర్గేష్ మాట్లాడుతూ మండలంలో రెవెన్యూ సమస్యలు పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని తెలిపారు. ప్రభుత్వ పథకాలు ప్రజలకు అందేలా, రైతుల భూ సమస్యలు త్వరితగతిన పరిష్కారమయ్యేలా పనిచేస్తానని పేర్కొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యం

సత్తెనపల్లి: మహిళలు ఆర్థికంగా బలోపేతం కావడానికి కృషి చేయాలని పల్నాడు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ పథక సంచాలకులు బాలు నాయక్ చెప్పారు. పట్టణంలోని ప్రగతి డిగ్రీ కళాశాలలో శనివారం సత్తెనపల్లి, పెదకూరపాడు నియోజకవర్గాల్లోని వీవోఏలకు జీవనోపాధులపై అవగాహన సదస్సులో నిర్వహించారు. బాలు నాయక్ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాల గురించి మహిళలకు అవగాహన కల్పించాలని తెలిపారు. సమావేశంలో డీపీఎం హనుమానాయక్, ఐబీ శ్రీలక్ష్మి, ఉన్నతి యాంకర్ పర్సన్ జీవన్, ఇన్సూ రెన్స్ హెచ్‌డీ రామాంజనేయులు, ఏపీఎంలు శివకుమార్, సునీత, కృపావేణి, స్త్రీ నిధి ఏజీఎం చిన్నబుల్లయ్య, మేనేజర్లు శ్రీనివాసరావు, అనూష, సురేష్ బాబు, సీసీలు పాల్గొన్నారు.

విద్యుత్ భారాన్ని తగ్గించాలి

సత్తెనపల్లి: సర్దుబాటు, ఫిక్స్‌డ్, కస్టమర్, ట్రూ ఆఫ్ చార్జీల పేరుతో ప్రజలపై విద్యుత్ భారాన్ని తగ్గించాలని సీపీఎం సీనియర్ నాయకుడు గద్దె చలమయ్య ప్రభుత్వాన్ని కోరారు. పట్టణంలోని పుతుంబాక భవన్‌లో శనివారం రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశానికి సీపీఎం పట్టణ కార్యదర్శి ధరణికోట విమల అధ్యక్షత వహించారు. చలమయ్య మాట్లాడుతూ పెరిగిన విద్యుత్ చార్జీల్ని వెంటనే తగ్గించాలని, లేనిపక్షంలో ఉద్యమాన్ని ఉద్ధృతం చేస్తామని తెలిపారు.

దిశ యాప్‌పై అవగాహన కల్పించాలి

క్రోసూరు: దిశ యాప్‌పై మహిళలు, బాలికలు, యువతులకు అవగాహన కల్పించాలని ఎస్ఐ పాల్‌రవీందర్ తెలిపారు. స్థానిక మండల సచివాలయ మహిళా పోలీసులతో శనివారం ఆయన పోలీసుస్టేషన్‌లో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఒక్కరు దిశ యాప్ డౌన్‌లోడ్ చేసుకునేలా చూడాలని తెలిపారు.

నేడు, రేపు తాళ్లచెరువులో 'గడప గడపకు మన ప్రభుత్వం'

అచ్చంపేట: మండలంలోని తాళ్లచెరువులో ఆది, సోమవారాల్లో సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 10గంటల వరకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చిల్కా చంద్రయ్య తెలిపారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే నంబూరు శంకరరావు పాల్గొంటారని చెప్పారు.

బడి ఈడు పిల్లలు బడిలోనే ఉండాలి

ముప్పాళ్ల: బడి ఈడు పిల్లలు బడిలోనే ఉండాలని న్యాయవాది దివ్వెల శ్రీనివాసరావు తెలిపారు. ముప్పాళ్ల గ్రామ సచివాలయంలో ఆంధ్రప్రదేశ్ సర్వోన్నత న్యాయస్థానం ఆదేశాల మేరకు బాలకార్మిక వ్యవస్థ అరికట్టేందుకు చేపట్టిన ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా శనివారం తల్లిదండ్రులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయవాది శ్రీనివాసరావు మాట్లాడుతూ 14 సంవత్సరాల్లోపు పిల్లల్ని పనులకు పంపకూడదని, వారిని బాలకార్మికులుగా మారిస్తే తల్లిదండ్రులతో పాటు సంస్థ యాజమాన్యం పైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో న్యాయవాదులు బి.లక్ష్మీకోటేశ్వరరావు, ఎస్.కె.సుబాని, కె.విజయగోపాల్, పంచాయతీ కార్యదర్శి ఆర్.నాగేశ్వరరావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అనంతలక్ష్మి పాల్గొన్నారు.

ఐకమత్యంతోనే మండల అభివృద్ధి

సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే నంబూరు శంకరరావు


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

అమరావతి: ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు సమన్వయంతో మండలాన్ని అభివృద్ధి చేసేందుకు కలసి రావాలని పెదకూరపాడు శాసనసభ్యుడు నంబూరు శంకరరావు తెలిపారు. మండలం పరిషత్ కార్యాలయంలో శనివారం జరిగిన సర్వసభ్య సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సమావేశానికి ఎంపీపీ మేకల హనుమంతరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గ్రామాల్లో జరుగుతున్న, జరగాల్సిన అభివృద్ధి కార్యక్రమాలపై అధికారులు, ప్రజాప్రతినిధులతో సమీక్ష నిర్వహించారు. అమరావతి మండలంలో గత పాలకులు చేయని ఎన్నో అభివృద్ధి పనుల్ని ఈ నాలుగేళ్లలో చేశామని చెప్పారు. అమరావతి - బెల్లంకొండ డబుల్ లేన్ రోడ్డుతో పాటు అమరావతి నుంచి తుళ్లూరుకు రోడ్డుతో పాటు పెదమద్దూరు బ్రిడ్జి కూడా నిర్మిస్తున్నామని తెలిపారు. ఇటీవల సీఎం వై.ఎస్.జగన్మోహనరెడ్డి నియోజకవర్గ పర్యటనను విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలియజేశారు.

జగనన్న సురక్షను విజయవంతం చేద్దాం

జగనన్న సురక్ష కార్యక్రమాన్ని అధికారులు, ప్రజాప్రతినిధులు, సచివాలయ సిబ్బంది విజయవంతం చేయాలని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు చెప్పారు. ప్రతి రోజూ ఐదు మండలాల్లో జరిగే కార్యక్రమాల్లో తాను కూడా పాల్గొంటానని తెలిపారు. కార్యక్రమంలో క్రోసూరు మార్కెట్ యార్డు చైర్మన్ ఈదా సాంబిరెడ్డి, జెడ్పీ కో-ఆప్షన్ మెంబర్ షేక్ హష్మీ, మాజీ ఎంపీపీ వెంపా జ్వాలాలక్ష్మీనరసింహారావు, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు మంగిశెట్టి శ్రీనివాసరావు, హౌసింగ్ డీఈ సూర్యభగవాన్, ఎంపీడీవో మాధురి, తహసీల్దార్ విజయశ్రీ , మండల సచివాలయ కన్వీనర్ భవిరిశెట్టి హనుమంతరావు పాల్గొన్నారు.

నేడు కమ్యూనిటీ హాలుకు శంకుస్థాపన

రాజుపాలెం: పులిచింతల నిర్వాసిత కేంద్రంలో ఆదివారం కమ్యూనిటీ హాలుకు రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు శంకుస్థాపన చేయనున్నట్లు డీజీసీఎంసీ డైరెక్టర్ పాలవాయి ఆదినారాయణ, సర్పంచ్ పులిబండ్ల అశోక్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు కూడా హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. ప్రజా ప్రతినిధులు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, నాయకులు పాల్గొనాలని వారు కోరారు.

ఆదర్శ పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

నకరికల్లు: మండలంలోని దేచవరం ఆదర్శ పాఠశాలలో 7,8,9 తరగతుల్లో ఖాళీల్ని భర్తీ చేసేందుకు దరఖాస్తుల్ని ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ వేళాంగిణి మేరి శనివారం తెలిపారు. 7వ తరగతిలో 50, 8వ తరగతిలో 40, 9వ తరగతిలో తొమ్మిది సీట్లు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. ఈనెల 27న రాత పరీక్ష నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఆసక్తి గలవారు పూర్తి వివరాలతో పాఠశాలలో సంప్రదించాలని ఆమె సూచించారు.